# పంచవన్నెల చిలుక

నగరం నడిబొడ్డున నందన వనము. నందనవనమున సుందర భవనము. ఆధునిక వసుతులన్నీ సంతరించుకొన్న కాన్సర్ ఆసుపత్రి. కాన్సరంటే ఖరీదైన రోగము గదా ! అలాగని అక్కడి ఫీజులు ఆకాశాన్నంటి లేవు. అందరికీ అందుబాటులో... నేలమీదున్నాయి. పరీక్షలన్నీ మామూలే. పరీక్షల తర్వాత - పిండి కొద్దీ రొట్టె అన్నట్టుగా - రోగం ముదురుదనాన్ని బట్టి వైద్యం. వైద్యాన్ని బట్టి నైవేద్యం.

ఆంధ్రప్రదేశ్‌లో కె.జి. నుండి మెడికల్ పీ.జి. దాకా చదివి అమెరికాలో అనుభవాలు మూటగట్టు కొచ్చుకున్న డాక్టర్... కాన్సర్ స్పెషలిస్టు. దాని యజమాని.... అదే డాక్టర్ రౌండ్స్ తిరుగుతూ అనసూయమ్మ దాకా వచ్చాడు. బీ.పి. పరీక్ష పూర్తయింది. పల్స్ చూశాడు.

"ఏం మేడమ్... ఎట్లా ఉంది ?" ఆత్మబంధువులా అడిగాడు.

"ఆ సంగతి మీరే చెప్పాలె" నూతిలోంచి వచ్చినట్టుందా మాట.

"అది కాదమ్మా... మీ నొప్పి.."

"నా నొప్పి నా దగ్గరే ఉంది. కడుపులో కత్తులు తిరుగుతున్నట్టుంది కాని డాక్టర్ ! "ఆపరేషన్ తప్పదా ?" కనురెప్పలు టపటప లాడినై. మొహం వివర్ణమైంది.

"తప్పదమ్మా. లివర్ కాన్సర్ సెకండ్ స్టేజి గదా ! లక్ష రూపాయలు డిపాజిట్ చెయ్యాలని పొద్దున్నే చెప్పేశాను.."

"సరే... ఆపరేషనైతే.. ఎన్నాళ్లు బతుకుతాను ?"

"చూడండమ్మా" నిర్వేదంగా నవ్వాడు "నేను వైద్యుణ్ని. దేవుణ్ని కాదు."

"అమ్మో ... డాక్టర్లు కూడా దేవుణ్ని నమ్ముతారా ?"

"డాక్టర్లైనా, యాక్టర్లైనా.. ఆ పైవాని పంచలో అందరూ ఆటబొమ్మలే గదా ! ప్రయత్నం మనవంతు. ఫలితం పైవాడివంతు. మీరు ధైర్యంగా ఉండండి."

"హూ !" సుదీర్ఘమైన నిట్టూర్పు "సరేగాని డాక్టర్ ! డబ్బు ఎప్పుడు కట్టాలె ?"

"సాధ్యమైనంత తొందరగా. ఇటు డబ్బు కట్టగానే అటు ఆపరేషన్‌కు ఏర్పాట్లు జరిగిపోతై. ఏ సంగతి రేపు పొద్దున చెప్పండి. ప్రస్తుతం అవే మందులు వాడండి."

డాక్టర్ వెళ్లిపోయాడు. డాక్టర్ వెంట సిబ్బంది. అయితే నాకిది జీవన సంధ్యా సమయమన్న మాట !.. పక్కకు తిరిగి పడుకుంది. ఒత్తిగిలి పడుకుంది.

తానెక్కడ పుట్టింది ? ఎలా పెరిగింది ? ఏం సాధించింది ? జీవన రంగస్థలమ్మీద ఎన్ని సన్నివేశాలు చూసింది !.. మరో పక్కకు తిరిగి కాళ్లు ముడుచుకుంది. కళ్లు మూసుకుంది.

ఎంత ప్రయత్నించినా... కంటి మీద కునుకు కరువైపోయింది. గతం గత: అని ఎంత అనుకున్నా ఆ గతము జ్ఞాపకాలే మెదడు పొరల్లో కదులు తున్నాయి.

ఆనాడు... తాను ఆనందరావు చేతిలో చెయ్యేసి ఆనందడోలిక లూగుతూ, పెద్దింటి కోడలుగా గడీలో అడుగు పెట్టింది. పుట్టినిల్లు పూరిల్లు. మెట్టినిల్లు కోటలాంటి బంగళా. కేవలం తన అందచందాలను చూసే ఆనందరావు పట్టుబట్టి పెద్దల నెదిరించి పెళ్లి చేసుకున్నాడు. పూటగడవడమే కష్టంగా ఉన్న ఇంట్లోంచి విలక్షణమైన గడీలోకి కోడలుగా ప్రవేశిస్తానని కలలో కూడా ఊహించలేదు. హైస్కూల్ దాకా చదివింది కాబట్టి అంతో ఇంతో ప్రపంచ జ్ఞానమబ్బింది.

వందల ఎకరాల వ్యవసాయక్షేత్రం, వేల గజాల బంగళా, కొన్ని ఎకరాల ఆవరణ, కనుసన్నల్లో మెదిలే పనిమనుషులు, పులిలాంటి మామగారు, సింహం లాంటి భర్త... ఇంకా తనకేం కావాలి ? కోటి కోర్కెల కొంగుముడి విప్పి ఆనందరావు హస్తబంధాల్లో కరిగిపోయింది. మనసులో పున్నమి వెన్నెల పూసింది.

అట్టహాసం వెనుక ఏముందో అర్థమయేందుకు చాలాకాలం పట్టలేదు.

స్నానానికి తోడిన వేన్నీళ్లు చల్లబడ్డాయని మామగారు పనిమనిషి చెంపలు చెళ్లు మన్పిస్తూంటే తన గుండెల్లో గుండు సూదులు గుచ్చుకున్నట్టనిపించింది. పాపం ! నీళ్లు తోడుమనగానే తోడింది. స్నానానికి రావడంలో మామగారే ఆలస్యం చేశారు. తప్పెవరిది ? శిక్షెవరికి ?

పొలంలో పశువులు పడి మేసాయట. పశువుల యజమానిని పిలిపించి పశువును బాదినట్లు బాదారు. తప్పు పశువుల కాపరిదా ? పశువులదా ? యజమానిదా ? లేక పశువుకంటే హీనంగా ప్రవర్తించిన మామగారిదా ? బుర్రలో భూగోళం గిర్రుమంది.

సన్నకారు షావుకారు వెయ్యి రూపాయల చేబదులిచ్చి నెలరోజుల తర్వాత అడిగాడట. అంతే...

"మేం గడీ ఊడబీక్కుని పారిపోతున్నాం బే ?" అంటూ పళ్లు కొరుకుతూ ఆ నిర్దోషిని మక్కెలిరగ్గొట్టారు.

ఏమిటిదంతా ! ఇంటి నిండా మనుషులే. సాటి మనిషి అరుపుల్ని, కేకల్ని పట్టించుకునే నాథుడే లేదు. పట్టించుకుంటే తన పుట్టి మునుగుతుందనే భయం కష్టజీవుల్ని మూగ జీవాలుగా మార్చేసింది.

గడీ ఒక జనారణ్యం. అక్కడ ఎవరి ప్రాణానికి వారు ఒంటరివారు. ఒకరితో ఒకరు సరదాగా మాట్లాడుకోరాదు. అంతా గుంభనంగా ఉండాలి. దొరల ముందు కబుర్లు చెప్పుకుంటే బుర్రలు రామకీర్తన పాడాల్సిందే.

ఓ సారి... ఏకాంత సమయంలో..

"ఏమిటీ అన్యాయము ? వాళ్లూ, మనుము అంతా మనుషులమే గదా !" భర్తను నిలదీసింది.

"అంతా మనుష్యులే, కానీ అందులో తేడాలు ఉన్నై." ఆనందరావు కనుబొమలెగిరి పడినై. "ఒక్క చేతికున్న ఐదువేళ్లు సమానంగా ఉన్నాయా ! మనుషులు గూడా అంతే..." కొట్టిపారేశాడు.

"అంటే... !"

"మనం జాగీర్దార్లం. యజమానులం. వాళ్లు గతిలేనోళ్లు, జీతగాళ్లు. మనం చెప్పిన పని చెయ్యాలని ఆ దేవుడే రాసిపెట్టిండు."

"రాసి పెట్టింది దేవుడు కాదు. ఇట్లా గిరిగీసి పెట్టింది మనుషులే. ఇదన్యాయం గదా!" లోపలి నుండి ఎసరు పొంగుకొచ్చి పెదాలను వణికించింది.

భర్త మొహం విచిత్ర వర్ణచిత్రమైంది.

"ఇక్కడ న్యాయాన్యాయాలను నిర్ణయించేది నువ్వు కాదు. నువ్వీ ఇంటి కోడలువు మాత్రమే. గరీబుల ఇంట పుట్టి పెరిగినవు గదా. లేకి దానికి సిరి వస్తే లేచి లేచి పోయిందంటరు. ఆ లేకిడి బుద్ధులు మరిచిపో. దొరసానివి... దర్జాగా ఉండు. పెదాలతో నోరు మూయించి కౌగిట్లో బంధించాడు. మనసు వెనక్కు పోయినా మనిషి రాజీపడక తప్పలేదు.

బంగారు పంజరములో పంచవన్నెల రామచిలుక లాగైంది. భూస్వామ్యం మత్తులో జరిగిపోతున్న ఘోరాలకు సాక్షిగా నిలబడింది.

ఓ సారి మామగారు ఊరెళ్లారు. ఆ మధ్యనే పెళ్లి చేసుకున్న నౌకరు పోషయ్య భార్య నీలవ్వ గూడా గడీలో పనికి కుదిరింది. ఇంటి పని, వంట పనుల్లో తనకు పూర్తిగా సహకరించేది.

ఆ రోజు సాయంత్రం... సంధ్యాసమయం బురుజు గోడల్ని బూడిద వర్ణం చేస్తూంది. అప్పుడే గడీలో దీపాలు వెలిగించింది నీలవ్వ. అలవాటు ప్రకారం భర్త ఆనందరావు బ్రాందీ బాటిల్ ముందుంచుకుని ఒక్కో పెగ్గు వేసుకుంటున్నాడు. వేడి వేడి పకోడీలు కిస్తీలో ఉంచి నీలవ్వతో పంపి తాను కూడా బయటికొచ్చింది.

"పకోడీల కిస్తీ టేబుల్ మీదుంచు." ఒళ్లంతా కళ్లు జేసుకుని చూస్తున్నాడు ఆనందరావు.

వయసు పొంగులో ఉన్న నీలవ్వది సామనలుపు. చక్కని రూపం. వయ్యారాలు ఒలకబొయ్యదు కాని... ఒంపు సొంపులు బోలెడు... లేచొచ్చి చెయ్యందుకున్నాడు. నీలవ్వ గాజులు ఘల్లుమన్నై. తన గుండె ఝల్లుమంది.

"గిదేంది దొరా ?" వణికిపోతూ విడిపించుకునే ప్రయత్నం చేస్తోంది - నీలవ్వ. గొల్లున నవ్వాడు.

"గజ్జెల గుఱ్ఱమోలున్నవు. గామాత్రం తెల్వదే పోరీ" దగ్గరకు లాక్కున్నాడు.

"హమ్మో... తప్పు... వద్దు దొరా..." హడలిపోయింది. పిల్లి కూనలా తనవైపు చూసింది. ఒళ్లు భగ్గుమంది తనకు.

"ఛీఛీ... గిదేందయ్యా ?" పరుగెత్తుకెళ్లి నీలవ్వను లాగేసింది. ఆనందరావు కళ్లల్లో కామం బుసలు కొడుతోంది.

"నీలా ! నువ్వెళ్లి ఫో !" అరిచింది తను

"నీ యవ్వ... ఆగు" నీలవ్వ చేతులందుకున్నాడు.

"నువ్వెళ్లిపో..." తనను పక్కకు నెట్టేశాడు. నీలవ్వ పెనుగులాడుతూ ఓ చెయ్యి విడిపించుకుంది. మరో చెయ్యి గట్టిగా పట్టుకుని లాక్కెల్తున్నాడు.

"నీ బాంచెను దొరా... నన్నిడువు. నేనసొంటి దాన్ని కాను. నీ చెల్లెలసొంటి దాన్ని... కాల్మొక్త దొరా..." బతిమాలుతూ, లబలబలాడ్తూ నెత్తి కొట్టుకుంటూంది. ఆనందరావు సింహమయాడు. సింహం పంజాలో చిట్టెలుకైంది నీలవ్వ.

ఇది కలగాదు గదా !... అయోమయంలోంచి తేరుకునే లోగా నీలవ్వను పడగ్గది దాకా లాక్కెళ్లాడు. తనలో కోపం, అసహ్యం, రోషం కలుపుకొచ్చి ముక్కుపుటాల నెగిరిస్తున్నాయి.

"ఏయ్ దొరా ... !" అరుస్తూ వెళ్లి ఆనందరావు జబ్బ అందుకుని లాగింది. అతడే మాత్రం చలించలేదు సరికదా తన పొత్తి కడుపులో గట్టిగా తన్నాడు. వెల్లకిలా పడిపోయింది.

"నీయవ్వ... నువ్వా నాకడ్డమొచ్చేది !" పల్లు పటపటలాడినై. "నీలవ్వను అమాంతం చేతుల మీద ఎత్తుకుని గదిలో కెళ్లాడు. దభీన తలుపులు మూసుకుపోయినై. క్షుద్ర దేవతకు బలైపోతున్న మేకపిల్లలా... గదిలోంచి నీలవ్వ హాహాకారాలు... తన గుండెల్ని పిండేసినై.

తన ముందే భర్త మరో ఆడదానితో కులుకుతూంటే ఏ భార్య సహిస్తుంది ? సత్తువనంతా నరాల్లోకి తెచ్చుకుని లేచి పరుగెత్తింది. గది తలుపుల్ని కసిదీరా బాదేసింది. ఆకలి సింహం ఆగలేదు.

బయట తన గాజులు, లోపల నీలవ్వ శీలం... బదాబదలై పోయినై. ఐపోయింది. అంతా ఐపోయింది. తనకళ్ల ముందే పూవులాంటి ఓ అబల జీవితం ఉక్కుపాదం కింద నలిగిపోయింది. భగవంతుడా ! ఇలాంటి అనుభవం మరే ఆడదానికీ వద్దు... మనసు ఆక్రోశించింది. అపుడు తానేమి చేయ గలిగింది ?

ఊరు నుండి మామగారు రాగానే విషయమంత వివరంగా చెప్పి కంటతడి పెట్టింది. కొడుకును గట్టిగా మందలించి బుద్ధి చెబుతాడనుకుంది. మామగారి పెదాల మీద మాయదారి మందహాసం మెరిసింది.

"పిచ్చి అనసూయా ! ఇలాంటివి ఈ ఇంటి కోడళ్లు పట్టించుకోరు. వాడు మొగాడు. మొనగాడు. వయసులో ఉన్నడు గదా ! కండబట్టి పుష్టిగా ఉందాపోరి. వాని కండ్లల్ల పడ్డది. ఇష్టపడ్డాడేమో ! గామాత్రానికే నువ్వు గంత బాధపడాల్నా" మీ అత్త బతికున్నన్ని రోజులు గివన్నీ పట్టించుకుందా ? ఆ సంగతి మరిచిపోవమ్మా !" తననే మందలించాడు. అదో మామూలు విషయంలా కొట్టిపారేశాడు. కంచె చేను మేస్తే కాపలాదారెవరు ?

దానికి ఫలితం రాత్రి ఆనందరావు "గా మూడు ముడికాల్ల సంగతి మానాయినకు చెప్తవా ? గుడిశెలున్న దాన్ని దెచ్చి గడీల రాణిని జేస్తే గడ్డిపోచలు నాకే బుద్ధిపోనియ్యవా ? నీ యవ్వ ..." బూతులు తిడుతూ లెంపలు వాయించాడు. వీపు విమానం మోత మోగింది.

అలాంటి సంఘటనలెన్నో జరిగిపోయినై. వాటిని భరించలేక, ఏడ్వలేక పొంగుకొస్తున్న ఆవేశాన్ని అణుచుకోలేక తాననుభవించిన మనోవేదన అంతా ఇంతా గాదు.

పెళ్లై పదేళ్లు గడిచినా తన కడుపు పండలేదు. తన భర్తకు మరో పెళ్లి చెయ్యాలని మామగారు సంబంధాలు వెతుకుతున్నారని తెలిసింది. అరికాలుకింద ఆటంబాంబు పేలింది. తొందర పడితే బతుకు చిందర వందరయి పోయేట్టుంది. మనసు బిగపట్టుకుని మామగారి పాదాలకు నమస్కరించింది. "మీరు నా తండ్రి లాంటి వారు. భార్య బతికున్న భర్తకు మరో పెళ్లి చెయ్యడం న్యాయమా మామయ్యా ?" అడిగింది దీనంగా. ఆయన మీసాలు సరిజేసుకుని

"మరి నువ్వు తల్లివి గాలేదు గదా, మా వంశం ఖతమై పోవల్నా ?" గద్దించాడు.

"పూటకో పాపం జేస్తూ పిల్లలు పుట్టలేదంటే ఎట్లా ?" అందామన్పించింది. ధైర్యం చాలక ఆ మాటను గొంతులో అదిమి పెట్టాల్సి వచ్చింది. తనకో సవతి రాకుండా చూడమని వెయ్యి దేవుళ్లకు మొక్కుకుంది. ఉపవాసాలు చేసింది. సంసార సాగరంలో సుడిగుండం దాటేసింది. ఆశ ఫలించింది.

అదే నెలలో నెల తప్పింది. రెండో పెళ్లి ప్రయత్నం ఆగిపోయింది. పదో నెలలో పండంటి బాబు... అదే ఇప్పుడు అమెరికాలో ఉన్న అరవింద్ జన్మించాడు. బోసినవ్వుల బాబు తన కలలపంట, తండ్రీ తాతయ్యల ముద్దుల పట్టి. బాబును గుండెలకు హత్తుకుని ఆశల పల్లకిలో ఊరేగిన సంతోషం ఎంతో కాలం నిలువ లేదు. ఐదో ఏట బాబును హైద్రాబాదు తీసుకెళ్లి రెసిడెన్షియల్ స్కూల్‌లో చేర్పించారు. కాలేజి చదువు గూడా హాస్టల్ గదుల్లో సాగింది. పాతికేళ్లు నిండక ముందే ఫారిన్ వెళ్తానని మారాము చేశాడు. అమెరికా వెళ్లి అక్కడే ఉండి పోయాడు. అక్కడి అమ్మాయినే పెళ్లి చేసుకున్నాడు.

పెరిగే వయసులో దూరంగా ఉన్న వానికి తల్లిదండ్రుల మీద మమతానురాగాలు ఎలా చిగురిస్తాయి ? అది అసంభవం. అరవింద్ హైస్కూల్లో చదివేప్పుడు మామగారు మరణించారు. వాడు ఇలా వచ్చి అలా వెళ్లి పోయాడు. చిలకాగోరింకల్లా కళ్లముందు తిరుగుతా రనుకున్న కొడుకు, కోడలు కలలకే పరిమితమయ్యారు.

దశాబ్దాల కాలగమనములో ఊహించని మార్పులు చోటుచేసుకున్నై. దేశములో ప్రజాస్వామ్యము ప్రబలమైన పుణ్యమాని పల్లెల్లో చైతన్యం చిందులేసింది. ఆనాడు ఊరి ప్రజల్ని గడగడలాడించిన జాగీర్దార్లు గజగజ వణకాల్సిన రోజులొచ్చినై. ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని పసిగట్టి ఎన్నో భూములమ్మేశాడు ఆనందరావు. బినామీ పేర్లమీద మిగిలిన భూముల్లో ఎర్రజెండాలు ప్రత్యక్షమైనాయి. ఆనందరావు ప్రతిఘటించాడు. పోలీసు సహాయం తీసుకున్నాడు.

ఆనాడు గడీల జీతగాళ్లుగా, వెట్టి చాకిరి గాళ్లుగా నరకయాతన అనుభవించిన వారి పిల్లలు కొందరు పట్టపగలు నట్టనడిబజార్లో ఆనందరావు కాళ్లూ చేతులు నరికి ఖతం జేశారు.

తాను గుండెలు బాదుకుంది. నెత్తి కొట్టుకుంది. వెక్కి వెక్కి ఏడ్చింది. ఆనాటి

నుండి బతుకు మరీ అగాధమై పోయింది. ఇహ ఊళ్లో ఉండలేక ఒంటరిగా పట్నం చేరుకుంది. మెడలో మిగిలిన తాళిబొట్టును అడిగిన ధరకు అమ్మేసి హైద్రాబాద్ చేరుకుంది.

తండ్రి మీది పగతో కొడుకును గూడా కొట్టి నరికెయ్యొచ్చునని హడలిపోయింది. అమెరికాలోని అరవింద్‌కు ఫోన్ చేసి ఇక్కడికి రావద్దని చెప్పింది... తండ్రి మరణ వార్త నెంత వివరించి చెప్పినా అరవిందేమీ స్పందించినట్టనిపించలేదు. ఊ కొట్టి ఊరుకున్నాడు.

ఇహ ఈ విశాల విశ్వములో తనకెవరున్నారు ? నగలు, నగదు - భర్త ఆనందరావు ఆర్భాటాలకు, కోర్టుకేసులకు, తాగుడుకు కరిగిపోయినై. స్థిరాస్తులను కొనేవారు లేరు. తాళిబొట్టు అమ్మగా వచ్చిన డబ్బులోంచి ఖర్చులన్నీ పోగా మిగిలింది పది రూపాయలు. తొమ్మిది రూపాలయతో ఆ పూట కడుపు నిండింది. ఆ రాత్రి హైద్రాబాద్ ఇమ్లీబన్ బస్టాండ్ లోనే గడిచింది. ఎడారిలో తప్పిపోయినట్లు - ఏ దారీ కన్పించలేదు.

తెల్లవారింది. కడుపులో కలకలం బయలు దేరింది. ఎన్నో రోజుల నుండి కడుపు నొప్పి, వాంతులతో బాధ పడుతోంది. ఊరి వైద్యుడు మందులిచ్చినా తగ్గలేదు. దగ్గరున్న ఒక్క రూపాయి పొద్దున్నే మరుగుదొడ్డి ఫీజుకు సరిపోయింది.

మొహం కడుక్కుంది. కడుపులోని కల్లోల తరంగాలు భయంకర రూపం దాల్చినై. ఇమ్లీబన్‌లోనే ఇటూఅటూ తిరుగుతోంది. కాస్సేపు టీ కొట్టు ముందు, కొంతసేపు పళ్ల దుకాణం ముందు నుంచుంది. ఆశలు నిండిన కళ్లతో నిరాశగా చూస్తోంది. మధ్యాహ్నమైంది. ఆకలితో నకనకలాడ్తూంది. కడుపులో కిర్రు కర్రు శబ్దాలు ఎక్కువైపోయినై. నొప్పి... భరించరాని నొప్పి... కడుపులో పేగుల్ని కరకర కోస్తున్నంత నొప్పి. భళ్లున వాంతి అయింది. అంతే... ఆ తర్వాత ఏమైందో తెలీదు.

స్పృహలో కొచ్చేసరికి మంచమ్మీదుంది. తలగడ పక్కన తన వయసు స్త్రీ... ఆమె నీలవ్వ గదూ. నీలవ్వనే... చెంచాతో పాలు తాగిస్తూంది. మరోవైపు పోషయ్య. ఆనాడు అదృశ్యమైన జంట... ఈనాడిలా... ఆశ్చర్యం.. ! అద్భుతం... !

"న్ని... నువ్వా నీలవ్వా ?" కళ్లు విశాలమైపోయినై.

"నేనేనమ్మా. మేము యాదగిరి గుట్ట నుండి వచ్చి ఇమ్లీబన్‌ల బస్సుదిగి వస్తున్నం. అక్కడ నువ్వు కింద పడున్నవ్. చుట్టూ జనాలున్నరు. ఆటోలో దీస్కొని ఇంటికొచ్చి డాక్టర్‌కు చూపించినం. ఇంజక్షన్లు, గుల్‌కోసు లెక్కినై." ఆప్యాయంగా మాట్లాడింది. తోబుట్టువులా ఆదరించి సేవలందించింది.

వారం రోజులలో లేచి తిరిగింది. నీలవ్వ... నిజానికి తనను ద్వేషించాలి. ఆమె భర్త పోషయ్య... తనను తరిమి కొట్టాలి. వీళ్లసలు మనిషిరూపంలో దేవుళ్లు. మనసు ఆర్ద్రమై గుండె కరిగింది. అశ్రుధారలు చెక్కిళ్లను తడిపేస్తున్నై అమాంతం నీలవ్వ కాళ్లను చుట్టేసి "నీలవ్వా! నేను నీకు నరకం చూపించిన. నువ్వు నాకు స్వర్గం చూపిస్తున్నవు. దీన్నెట్లా భరించాలె ?" వెక్కుతోంది.

"అమ్మో... దొర్సానీ !" నీలవ్వ కడుపు తరుక్కు పోయిందేమో ! "నీ కాళ్ల కాడ బతికినోళ్లం" భుజాలు పొదివి పట్టి లేపి గుండెలకు హత్తుకుంది.

"నీ తప్పేమీ లేదు గదమ్మా. అంతా ఆనందం దొరదే. అందుకు శిక్ష అనుభవించిండు గదా !" పోషయ్య చేతులు జోడించాడు. తన దుస్థితి విన్నారు.

ఆనాడు వాళ్లు హైద్రాబాదు కొచ్చి ఇస్త్రీ షాపు తెరిచారట. రాత్రింబవళ్లు శ్రమించారట. ఇప్పుడు మూడు మోడ్రన్ లాండ్రీలకు యజమానులట హుఁ ! కృషితో నాస్తి దుర్భిక్ష మన్నారందుకే. మనిషిలో మాధవుడుంటాడట. నిజమే !

వారం గడిచింది. కడుపు నొప్పి తిరగబెట్టింది. వాంతులు విపరీతమై పోయినై. ఈ కాన్సరు హాస్పిటల్లో చేర్పించారు. ఇది కాన్సరేనని డాక్టర్లు తేల్చి చెప్పారట. ఎక్స్‌రేలు, రక్త పరీక్షలు... ఇంకేవేవో పరీక్షలు..

అంత డబ్బు ఎక్కడి నుండి తేవాలి ? నీలవ్వ పోషయ్య ఔదార్యాన్ని ఇంకెంత కాలం భరించాలి ? వాళ్లు తనకోసం ఎందుకు ఖర్చుచెయ్యాలి ? అపకారికి ఉపకారము... అయినా కాన్సర్ ముదిరిందంటే... ఈ లోకం నుండి కాన్సిల్ కాకతప్పదు గదా ! ఒకవేళ పెద్దాపరేషన్ చేసినా ఎన్ని రోజులు బతికిస్తారు ? ఏం సాధించాలని బతికుండాలి ?... మెదడు పొరల్లో బోలెడన్ని ప్రశ్నలు సమాధానాలు లేక వెక్కిరిస్తున్నాయి. నిద్రమాత్రమే శరణ్యాం... అయినా నిద్రాదేవి కరుణించట్లేదు... ప్చ్... ! మంచమ్మీద అటుతిరిగి పడుకుంది. అనసూయమ్మకు ఆఖరు ఉపాయం తట్టింది.

* * *

"అయ్యో... ఇయ్యాల ఇంకా నిద్రలేవలేదా దొర్సానీ" అనసూయమ్మ భుజాలు పట్టి కుదిపింది నీలవ్వ.

"లెవ్వు దొర్సానీ ! జల్ది మొకం కడుక్కొని ఇడ్లీలు తిను... లెవ్వమ్మా" గట్టిగా... అంది చెవిలో. కదిలిక లేదు. స్పందన శూన్యం.

"అయ్యో... లెవ్వు... మాట్లాడు దొర్సానీ" రెండు భుజాలు పట్టి ఇటువైపు తిప్పింది. అనసూయమ్మ శరీరం మనిషిలా కాకుండా మానులా దొర్లింది. ఎడమ చేతిలోంచి నిద్రమాత్రల సీసా కింద పడింది. నిన్న అది నిండు సీసా... అప్పుడే ఖాళీ అయిందా ! అరెరే... ఎంత పనైంది! రోజుకొక్కటి వేసుకోవాలంటే... అన్నీ ఒకేసారి వేసుకుంది. ప్చ్... నీలవ్వ బోరుమంది.

పంచవన్నెల రామచిలుక శరీరమనే పంజరంలోంచి ప్రాణమనే చిలుక ఎప్పుడెగిరి పోయిందో !

**'నడుస్తున్న చరిత్ర' మాసపత్రిక**
**సెప్టెంబర్, 2001 లో ప్రచురితమైంది.**